క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో నటుడు నారా రోహిత్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సినీ నటుడు నారా రోహిత్ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రోహిత్‌కు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు.

యుగంధరాచార్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): లక్షకుపైగా జాతకాలను పరిశీలించినందుకుగాను పాతబస్తీలోని కూరపాటి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కిందని ఆ విద్యాసంస్థ కార్యదర్శి కూరపాటి నారాయణరావు తెలిపారు. ఈ మేరకు యుకే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ దివాకర్ సుకుల్ నుంచి సమాచారం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. యుగంధరాచార్య జాతక పరిశీలనలు 1993 నుంచి ప్రారంభించి 2023 సంవత్సరం వరకూ లక్ష జాతకాలకు పైగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. దానికి గాను ఈ రికార్డ్ సాధించారని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ పంపిన లేఖలో తెలియజేసినట్లు పేర్కొన్నారు. తమ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రపంచ రికార్డ్ సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. సహాయ కార్యదర్శి చంటి, పాఠశాల అధ్యాపక బృందం, సిబ్బంది యుగంధరాచార్యకు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపుకు గురైన బాధితులకు వైఎస్సార్ సీపీ నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ పులివెందుల రసూల్ సాహెబ్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలో అప్నాబజార్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో రసూల్ మాట్లాడారు. బుడమేరు వరద ముంచుకొస్తుందని ప్రభుత్వానికి ముందస్తుగానే తెలిసినా ప్రజలకు హెచ్చరిక చేయకపోవడంతోనే కొన్ని లక్షల మంది పేదలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం తప్పులు, చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై బురద చల్లడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నూర్‌బాషా అధికార ప్రతినిధి గాజుల బాజీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో



గుణదల(విజయవాడతూర్పు): వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో – 2024 నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి తెలిపారు. గుణదలలోని హోటల్ హయాత్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఈ మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్, కేటరర్స్ అసోసియేషన్, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్, విజయవాడ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో రెస్టారెంట్స్ పెట్టాలి అనుకునేవారికి కమర్షియల్ కిచెన్ ఎక్విప్‌మెంట్, హౌస్ పర్పస్ కోసం హోమ్ అప్లయన్సెస్, ప్యాకింగ్ అండ్ సీలింగ్ మిషనరీ, మసాల్స్, పికిల్స్, ఫ్రోజన్ ఫుడ్స్ వంటి 120 స్టాల్స్ వరకు కొలువుతీరతాయని వెల్లడించారు. అలాగే బిజినెస్ ఉన్న వారు ఇక్కడ స్టాల్స్ పెట్టుకుని వారి వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ కేటరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వరదరాజులు, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వక్కలగడ్డ భాస్కరరావు, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, గెద్దం రవి, రాఘవ, ఎం. వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, మండవ ఉమామహేశ్వరరావు, రేణుకా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ద్వీపం.. పునర్వైభవం ఎన్నటికో?

- సుమారు 12 అడుగుల వరద నీటిలో భవానీ ఐలాండ్ మునక
- వరద తాకిడికి కోసుకుపోయిన తీరం
- ద్వీపంలో ఎక్కడ చూసినా ఇసుక మేటలు
- ద్వీపంలో యాక్టివిటీస్ అన్నీ ధ్వంసం



బురద మయమైన గేమింగ్ జోన్



టూరిజం క్యాంగాన్ పుష్యమి చుట్టూ పేరుకుపోయిన ఇసుక మేట



పిల్లల ఆట పరికరాలు చుట్టూ వేసిన ఇసుక మేట



ఇసుక మేటతో నిండిన అమరావతి ఆతిథ్యం హోటల్ (గ్లాస్ రెస్టారెంట్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విజయవాడ భవానీపురంలోని భవానీ ద్వీపంలోకి దాదాపు 12 అడుగుల మేర చేరిన వరద నీటితో అతలాకుతలమైంది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి పొందిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో భాగమైన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కు చెందిన భవానీ ద్వీపం పూర్తిగా దెబ్బతింది. వరద ఉధృతి తాకిడికి ద్వీపం అంచులు కోసుకుపోయాయి. ద్వీపం మొత్తం ఇసుకు మేటలు వేసి పాత్‌వేలు కనబడకుండా పోయాయి. పుష్యమి హోటల్‌లో ఇసుక దిబ్బలు కనబడుతున్నాయి. గేమింగ్ జోన్ మొత్తం మునిగి దానిలోని గేమ్స్‌కు సంబంధించిన పరికరాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పాడైపోయాయి. పిల్లలు ఆడుకునే పరికరాల చుట్టూ ఇసుక మేటలతో కప్పబడింది. ద్వీపంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కాటేజీల సెల్లార్లు మునిగిపోయాయి. కాటేజీల రెన్నోవేషన్‌లో భాగంగా ఊడదీసిన ఏసీ మెషీన్లు కూడా నీట మునిగాయి. ద్వీపం ప్రవేశంలో ఉన్న రిసెప్షన్ కౌంటర్, అందులోని మేనేజర్ క్యాబిన్, సీసీ కెమెరాలు, ఇంటర్ కమ్ బేకప్, ఇంటర్‌నెట్, కిచెన్, దాని స్టోర్, జనరేటర్, ఎలక్ట్రికల్ రూమ్, ట్రాన్స్‌ఫార్మర్స్ మొత్తం వరద నీటితో మునిగిపోవడంతో ఫనికిరాకుండా పోయాయి. వరద నీటితో ల్యాండ్ స్కేప్, అలాగే పక్షుల కేంద్రం వెనుక ఉన్న రోడ్ ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా కూలిపోయిన వృక్షాలతో అధ్వానంగా మారింది. అమరావతి బోటింగ్ క్లబ్‌కు చెందిన బోట్లు వరద నీటిలో కొట్టుకు వచ్చి ద్వీపంలోకి చేరుకున్నాయి. వరద వేగానికి ద్వీపం ప్రవేశ మార్గం వద్ద ఉన్న జట్టీ పైకి ఎక్కేసింది. ద్వీపంలోని ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లోని కొలంబస్, డ్రాగన్ ట్రైన్, పిల్లలు ఎక్కే రకరకాల రైడ్స్ అన్నీ నీట మునిగాయి. కాగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల ద్వీపానికి వచ్చి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. దాదాపు రూ.10 కోట్ల మేర నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యమైనంత త్వరలో ద్వీపాన్ని పునరుద్ధరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తానని ఆయన తెలిపారు. ద్వీపం చక్కబడి ఎన్నటికి పునర్‌వైభవం కలుగుతుందోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, అంబాపురం, నైనవరం గ్రామాల్లో ముంపునకు గురై సర్వం (పుస్తకాలతో సహా) కోల్పోయిన బాధిత కుటుంబాల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రానికి సంబంధించి విద్యాధరపురంలోగల కేసీ హైస్కూల్ నిత్య మోగ సాధకుల సహాయ, సహకారాలతో కేసీ హైస్కూల్ అధినేత హర్షవర్ధన్ ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ తమ హైస్కూల్‌లో చదుకుంటున్న పేద విద్యార్థుల కుటుంబాలు ముంపునకు గురై దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా పిల్లల పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు తడిసిపోయి కొనుక్కోలేని దుస్థితిలో ఉండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. యోగ సాధన చేస్తున్న వారి సౌజన్యంతో పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. సాధకులు జనార్ధనరావు, టి.రాజా, వి.వంశీ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.హరిబాబు, వి.ప్రసాద్, మోహన్‌రావు, కిషోర్, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలను నిండా ముంచిన ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగర ప్రజలను ప్రభుత్వం నిండా ముంచిందని, వరదలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి బాబూరావు మాట్లాడారు. వరదలకు 2.70 లక్షల కుటుంబాలు, ఎనిమిది లక్షల జనం నిండా మునిగిపోయారని, వందల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వైఫల్యమేనని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వరదల్లో నగరంతోపాటు ఎన్టీఆర్ జిల్లాలోని లక్షలాది మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రూ. 10 వేల కోట్లు కేంద్రం నిధులను విడుదల చేసి, బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పరిహారం పెంచాలి

వరదల్లో నష్టపోయిన గృహాలకు రూ. 50 వేలు, అలాగే దెబ్బతిన్న ఆటోకు రూ. 10 వేల నుంచి 25 వేలు, టూ వీలర్‌కు రూ. 3 వేల నుంచి 10 వేలకు పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీని పెంచి ఇవ్వాలని కోరారు. ఆగస్టు, సెప్టెంబర్ విద్యుత్ బిల్లులను రద్దు చేయడంతోపాటు గడుస్తున్న ఈ ఆర్థిక సంవత్సరపు ఆస్తి, ఇతర పన్నులను సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బుడమేరు వరద ప్రభుత్వ తప్పిదమే


ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



ఆటో కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఓబులేసు, శంకర్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద విజయవాడను ముంచెత్తనుందని అధికారులు ముందస్తుగా సమాచారం ఇచ్చినా స్పందించని ప్రభుత్వ యంత్రాంగం తప్పిదమేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సౌజన్యంతో శనివారం వరద ముంపు బాధితులైన ఆటో కార్మికులకు దుప్పట్లు, టవల్స్, లుంగీలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుడమేరు వరద గురించి ముందుగానే తెలిసినా ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయక పోవడంతో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 60 మంది వరకు చనిపోయారని తెలిపారు. అలాగే వేలాది పేద కుటుంబాల ఇళ్లు మునిపోయి సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అందించే నష్ట పరిహారంపై చంద్రబాబు గంభీరోపన్యాసం తప్ప ప్రకటించిన పరిహారం ఏ మూలకు సరిపోదని చెప్పారు. అచ్యుతాపురంలో రియాక్టర్ పేలి చనిపోయిన వారికి కోటి రూపాయలు ప్రకటించిన ప్రభుత్వం వరదల కారణంగా మృతి చెందినవారికి రూ.5లక్షలు ప్రకటించడంపై మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం పడుకోబెట్టిందని, వారే ఉండి ఉంటే ఇంటింటికీ వెళ్లి సాయం అందించేవారని గుర్తు చేశారు. ఇది జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులు వరద కారణంగా తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఆటో ఇన్సూరెన్స్‌లో 50 శాతం మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సెక్రటరీ ఏ ఎల్లారావు, ఈసీ సభ్యుడు బీ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

జారిపడిన భారీ కొండరాళ్లు



ముసాఫిర్‌ఖానాపై జారిపడిన కొండరాళ్లు



కొండరాళ్లను తొలగిస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్ వెస్ట్‌బుకింగ్ సెంటర్ సమీపంలోని ముసాఫిర్‌ఖానా వెనుక భాగంలోని గాంధిహిల్ నుంచి భారీ కొండచరియలు శనివారం జారిపడ్డాయి. భారీగా కొండచరియలు జారి పడటంతో స్థానికంగా సంచలనం సృష్టించింది. ముసాఫిర్‌ఖానా నిర్మాణానికి కొంతమేర కొండచరియలను తొలగించి పూర్తి చేశారు. ముసాఫిర్‌ఖానాకు కొండకు మధ్యన ఇనుప కంచెను వేసి నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఇటీవల భారీ వర్షాల కారణంగా గాంధీహిల్‌పైన కొండ చరియలు బాగా నాని ఉన్నాయి. దాంతో కొండపై భాగం నుంచి భారీ స్థాయిలో ఉన్న చరియలు జారటంతో భవనానికి ఉన్న గోడపై పడ్డాయి. అలాగే ఇనుప కంచె సైతం పక్కగా ఒరిగింది. దాంతో ఏసీ కోసం ఏర్పాటు చేసి నిర్మాణాలు సైతం దెబ్బతిన్నాయి. అలాగే భారీ కొండరాళ్లు పడటంతో స్థానికంగా ఉండే సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడకు చేరుకున్నారు. జేసీబీల సాయంతో కొండచరియలను తొలగించే పనులను చేపట్టారు. రెండు రోజులు పాటు ఈ పనులు జరిగే అవకాశముంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫ్లాష్‌మాబ్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ట్రెండ్ సెట్ మాల్ లో ఫ్లాష్ మోబ్ ద్వారా రీసైకిల్, రీ యూస్, రెడ్యూస్ (ఆర్ఆర్ఆర్) నగర ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా క్విజ్, ఎలక్యూషన్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెడ్యూస్ రియూస్ రీసైకిల్ అనే అంశంపై ప్రజలందరికీ కచ్చితంగా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యర్థాలను ఎక్కువ మొత్తంలో కాకుండా సాధ్యమైనంత తక్కువగా చేసేందుకు ప్రొడ్యూస్ పద్ధతిని వాడాలని తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2, వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

నేటి నుంచి వరద ప్రభావిత లబ్ధిదారుల ప్రకటన

పటమట(విజయవాడతూర్పు): బుడమేరు, కృష్ణానది వరద ప్రభావంతో కోల్పోయిన వారికి ప్రభుత్వం సహాయం చేసేందుకు లబ్ధిదారుల కోసం ఇటీవల నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో తప్పొప్పులు, అభ్యంతరాలు ఉంటే సంబందింత అధికారులకు ఈ నెల 22, 23 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలైన నగరంలోని 32 వార్డులో ఉన్న సచివాలయాల్లో ఆదివారం సెలవు దినమైనప్పటికీ సచివాలయాలన్నీ పనిచేస్తాయని పేర్కొన్నారు. అధికారులు అందరూ అందుబాటులో ఉంటారని, ఆ సచివాలయాల్లో ఎన్యూమరేషన్ లబ్ధిదారుల లిస్టులను ప్రకటిస్తారన్నారు. ఆయా సచివాలయాల్లో సీనియర్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కూడా అందుబాటులో ఉంటారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ ఒక్కసారి ప్రకటించిన లిస్టును చూసి అభ్యంతరాలు ఏవైనా ఉన్నచో వెంటనే అక్కడున్న సీనియర్ ఆఫీసర్‌కి కానీ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కి గాని తెలుపవచ్చని తెలిపారు. ప్రజలందరూ తమ తమ సచివాలయంలోకి వెళ్లి ఆ లిస్టు ను గమనించాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి విజయవాడ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు శనివారం జరిమానా విధించారు. ఐదో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మంది పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకున్న వెంటనే న్యాయమూర్తి వద్ద హాజరుపర్చారు. వీరిలో ఏడుగురికి రూ. 15 వేల చొప్పున, 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

హిందీ భాషతో అద్భుత విజయాలు

దక్షిణ భారత హిందీ ప్రచార సభ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరిశెట్టి



మాట్లాడుతున్న డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించటం ద్వారా అద్భుత విజయాలను సాధించవచ్చని దక్షిణ భారత హిందీ ప్రచార సభ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివాస్ సప్తాహ్ ముగింపు సందర్భంగా హిందీ అవశ్యకతపై సదస్సు ఆ కళాశాల సెమినార్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలను అనుసంధానం చేయటంలో హిందీ భాషా గొప్ప సాధనంగా పని చేస్తుందన్నారు. సుమారు వెయ్యి సంవత్సరాలుగా హిందీ భాష మరింత వేగంగా ముందుకు దూసుకుపోతుందని చెప్పారు. కృత్రిమ మేథోరంగంలోనూ హిందీ భాష వినియోగం పెరగటం శుభపరిణామమని పేర్కొన్నారు. భాషపై పట్టు సాధించటం ద్వారా దేశంలో ఏ ప్రాంతంలోనైనా చక్కగా రాణించవచ్చని వెల్లడించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ హిందీ భాషా విశిష్టతను గురించి ఏటా హిందీ దివాస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే క్రమంలో కార్యక్రమాన్ని విభాగాధిపతి జె.జానకి, అధ్యాపకులు కె.రేణుక, డాక్టర్ కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ సాధనకు సాంకేతిక పరిజ్ఞానం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ సాధించేందుకు విజయవాడ నగర పాలక సంస్థ అన్ని విధాలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోంచుకుంటుందని స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్, స్వచ్ఛ భారత్ మిషన్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ మిషన్‌లో మిలియన్ ప్లస్ నగరాలు, రాష్ట్ర రాజధానులు, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థ నిర్వహణ తదితర అంశాలపై బడ్జెట్లో స్థానిక సంస్థలు చేయాల్సిన కేటాయింపు గురించి స్వచ్ఛ భారత్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్ర వీఎంసీ కమిషనర్‌కు వివరించారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లను ఆధునికీకరించటం, ప్రజలందరికీ నాణ్యమైన తాగునీరు సరఫరా అందించడం, ఘన వ్యర్థ పదార్థాల సేకరణ నిర్వహణ మెరుగుపరచటం లాంటి విషయాలపై అధునాతన విధానాలను అనుసరించడంపై వీఎంసీకి సూచనలు చేశారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ద్వారా శుద్ధి అయి వచ్చిన నీటిని వ్యవసాయానికి ఉపయోగించటం, స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వారిని భాగస్వాములు చేస్తూ ఇటువంటి కార్యక్రమాల్లో వారిని పాల్గొని చేసేలా చూడాలని కోరారు. కాన్ఫరెన్స్ లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్ఈ (ప్రాజెక్ట్) రామ్మోహనరావు, ఎస్ఈ (వర్క్స్) శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

బురద బాధలు..





వరద ముంపు నుంచి కోలుకున్న తర్వాత ప్రజలను బురద కష్టాలు వెంటాడుతున్నాయి. గృహాలన్నీ బురదమయంతో నిండిపోయి ఉన్నాయి. ఇళ్లలో విలువైన టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు ఇతర విలువైన సామాన్లు సైతం బురద కొట్టుకుపోయాయి. విజయవాడ రామరాజ్యనగర్‌లో బురదతో నిండి ఉన్న ఇంట్లోని సామాన్లు శుభ్రం చేసుకుంటున్న చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

29న కృష్ణా జిల్లా రచయితల సంఘం మహా సభలు

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం మహాసభలు ఈ నెల 29వ తేది ఆదివారం అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో నిర్వహిస్తునట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, కవి నగ్నమును ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పర్యావరణ సదస్సు, సాహితీ మూర్తుల పురస్కారాలు, కవితా గోష్ఠి జరుగుతుందని తెలిపారు.

మసాజ్ సెంటర్లపై పోలీసుల దాడి

గుణదల(విజయవాడతూర్పు): మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు మసాజ్ సెంటర్లపై పోలీసులు శనివారం దాడి చేసి నలుగురు మహిళలు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. మసాజ్ సెంటర్లలో వ్యభిచారం జరుగుతుందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మాచవరం సీఐ సీహెచ్ ప్రకాష్ తన సిబ్బందితో కలిసి మొగల్‌రాజ్‌పురం, లబ్బీపేట బందరురోడ్డులోని పలు మసాజ్ సెంటర్లపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో 4 మహిళలు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. మసాజ్ సెంటర్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.